సాక్షి
గుంటూరు
శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



## జడ్జి ఆపన్నహస్తం

భట్టిప్రోలు: ఓలేరు పల్లెపాలెంలో 100 వరద బాధిత కుటుంబాలకు గురువారం గుంటూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి పార్థసారథి దుప్పట్లు పంపిణీ చేశారు.



## పులిచింతలలో43 టీఎంసీల నిల్వ

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టు 2 గేట్లను మూడు మీటర్లు ఎత్తి 83,877 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 43 టీఎంసీలు నిల్వ ఉంది.



## 50,049 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 47,159 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 50,049 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

# తిరిగి వెళ్లిపోయారు..!

వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం సభ్యుల పర్యటన మొక్కుబడిగా సాగింది. వరదలతో గూడు చెదిరి, గుండె పగిలి అల్లల్లాడుతున్న ప్రజల్ని ఓదార్చలేదు. రెక్కల కష్టం నీటి పాలైన రైతులకు భరోసా కల్పించలేదు. నిలువ నీడ లేక పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న బాధితులకు పరామర్శలు లేవు. పర్యటన అంతా తూతూమంత్రంగా సాగింది. జిల్లావ్యాప్తంగా వరద నష్టాన్ని అంచనా వేసేందుకు సభ్యులు గురువారం పెదకాకాని, మంగళగిరి, తెనాలి, తాడేపల్లి రూరల్ మండలాల్లో పర్యటించారు. వరద బాధితులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. అయితే, భాషా సమస్య అడ్డంకిగా మారింది. వరద బాధితుల బాధలు చెవికెక్కాయో లేదో అర్థం కాలేదు.




పెదకాకాని మండలం దేవరాయబొట్లపాలెంలో వరద నీరు నిలిచిన పొలం (ఇన్‌సెట్) వెంకటకృష్ణాపురంలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం




నీళ్లలోనే మగ్గాలు (ఇన్‌సెట్) మంగళగిరిలో వరద నీటికి పాడైపోయిన మగ్గాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

### ఇలా వచ్చారు .. అలా వెళ్లారు !

- కేంద్ర బృంద సభ్యులు చెప్పింది మాకు అర్థం కాలేదు
- మేం చెప్పింది వారికి అర్థమైందో లేదో తెలియదు
- మహానాడులో వరద బాధితుల ఆవేదన

తాడేపల్లి రూరల్: ''ఇలా వచ్చారు... అలా వెళ్లారు.. వారు మాతో మాట్లాడారు... మేము ఏం మాట్లాడామో వారికి అర్థం కాలేదు.. వారు ఏం చెబుతున్నారో మాకు అర్థం కాలేదు..ఎందుకు వచ్చారో.. ఎందుకు వెళ్లారో తెలియడం లేద''ంటూ కృష్ణానది తీరంలో మహానాడు వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వరద నష్టాన్ని అంచనా వేసేందుకు గురువారం మధ్యాహ్నం కేంద్ర బృంద సభ్యులు కలెక్టర్ నాగలక్ష్మితో కలసి తాడేపల్లిలోని మహానాడులో పర్యటించారు. వరద ఉధృతంగా ప్రవహించిన ప్రాంతంలో పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న నివాసాలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. 30 సంవత్సరాల నుంచి ఇక్కడే ఉంటున్నామని, ఎప్పుడూ ఇంత నష్టం జరగలేదని పలువురు వాపోయారు. ఇళ్లు పూర్తిగా కూలిపోవడంతో పాటు సామగ్రి కూడా దెబ్బతిందని తెలిపారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లను తొలగించి, ప్రభుత్వం ఇళ్లు కట్టించాలని కోరారు. సెంట్రల్ టీం సభ్యులు వారిని బుజ్జగిస్తూ మాట్లాడారు. అయితే ఆంగ్లంలో ఉండటంతో ఒక్క ముక్క అర్థం కాలేదని పలువురు వాపోయారు. తమ బాధల్ని స్థానిక అధికారులు వారికి వివరించి, వారు చెప్పిన మాటలు తమకు తెలియజేస్తే బాగుండేదని పలువురు తెలిపారు. ఏం మాట్లాడారో తెలిస్తే తమ బాధలన్నీ వివరించేవారమని కేంద్ర సభ్యులతో మాట్లాడిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనా సహాయం చేసే విధంగా మాట్లాడారని, కానీ ఎలాంటి సహాయం అందిస్తారో వివరంగా చెప్పలేదని స్థానికులు అంటున్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, ఆర్డీవో శ్రీకర్, మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ అలీమ్ బాషా, అడిషనల్ కమిషనర్ శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### పంట దెబ్బతిన్న ప్రతి రైతుకూ పరిహారం

కలెక్టర్ నాగలక్ష్మి

పెదకాకాని: వరదలతో పంట దెబ్బతిన్న ప్రతి రైతుకీ నష్ట పరిహారం ఇస్తామని జిల్లా కలెక్టర్ జి. నాగలక్ష్మి తెలిపారు. అధిక వర్షాలు, వరదల ప్రభావంతో దెబ్బతిన్న పంటలు, కాలువ కట్టలకు, చెరువులకు పడిన గండ్లు పరిశీలించడానికి కేంద్ర బృంద సభ్యులు గురువారం జిల్లాలోని పెదకాకాని, తెనాలి రూరల్, మంగళగిరి, తుళ్లూరు మండలాల్లో పర్యటించింది. పెదకాకాని సమీపంలో గండి పడిన గుంటూరు చానల్ (కొత్త కాలువ), వెంకటకృష్ణాపురం శివారులో గండి పడిన మురుగు కాలువతో పాటు దెబ్బతిన్న వరి పొలాల్ని పరిశీలించారు. పొలంలో నీట మునిగి ఉన్న వరి దుబ్బులను రైతులు టీం సభ్యులకు చూపించారు. అనంతరం మురుగు కాలువ సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పంటల సాగు, దిగుబడులు, ఆదాయం, ప్రస్తుత పరిస్థితి పంటకు పెట్టుబడులు, నష్టం వంటి అంశాలపై రైతులతో చర్చించారు. ప్రస్తుతం నీళ్లు తగ్గినా కుళ్లిపోయిన వరిపైరు చేతికి రాదని రైతులు సభ్యులు దృష్టికి తెచ్చారు. డిసెంబర్‌లో మాత్రమే రెండో పైరు వేసుకోవడానికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే పంటనష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఉప్పలపాడుకు చెందిన రామకృష్ణ, దేవరాయబొట్లవారిపాలేనికి చెందిన మాణిక్యరావు కోరారు. ఇప్పటికే ఎకరానికి 15 వేల రూపాయలు వరకూ పెట్టుబడులు పెట్టామని, పొలాల్లో నిల్వ చేసుకున్న ఎరువుల బస్తాలు కూడా నీటిలోనే కరిగిపోయాయని వివరించారు.

ఆయిల్ ఇంజన్లు, కరెంటు మోటార్లు కూడా నీటిలో మునిగి దెబ్బతిన్నాయని సెంట్రల్ టీం సభ్యుల వద్ద ఆవేదన వెలిబుచ్చారు.

రైతులు చెప్పిన అంశాలను సెంట్రల్ టీం ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి వివరించారు. ముందుగా వరదల కారణంగా దెబ్బదిన్న పైర్లు వరి, పత్తి, మినుము, నూగు మొక్కలను రైతులు సెంట్రల్ టీం సభ్యులకు చూపించి నష్టాన్ని తెలియజేశారు.కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు అగ్రికల్చరల్ ఫార్మర్స్ వెల్ఫేర్ కాటన్ డెవలప్‌మెంట్ నాగపూర్ డైరెక్టర్ డాక్టర్ ఏ.ఎల్. వాగ్మర్, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ న్యూఢిల్లీ కన్సల్టెంట్ ఆర్.బి. కౌల్,, డెప్యూటీ సెక్రటరీ మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ న్యూఢిల్లీ ప్రదీప్ కుమార్, గుంటూరు ఆర్డీఓ పి. శ్రీకర్, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఏడీఏ సునీల్‌కుమార్, తహసీల్దార్ టి. కృష్ణకాంత్, ఎంపీడీఓ బి.వి. మల్లేశ్వరరావు, ఏఒ పి. సంధ్యారాణి, ఏఈఓ శివాజీ పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### జాతీయ విపత్తుగా ప్రకటించాలి



లక్ష్మీపురం: వరద నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని రైతు సంఘ జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు కోరారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం కేంద్ర ప్రభుత్వ హోం శాఖ జాయింట్ కార్యదర్శి, బృందాన్ని రైతు సంఘ నాయకులు కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘ నేతలు మాట్లాడుతూ జిల్లాలో డెల్టాతో పాటు ఇతర ప్రాంతాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. రాష్ట్రానికి రూ.10వేల కోట్ల ఆర్థిక సాయం చేస్తేనే అన్ని జిల్లాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు అజయ్‌కుమార్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### దెబ్బతిన్న పుష్కర ఘాట్లు



తాడేపల్లి రూరల్ : వరద ప్రవాహానికి కృష్ణా పుష్కర ఘాట్లు ధ్వంసం అయ్యాయి. ఇటీవల ప్రకాశం బ్యారేజ్‌కు ఎగువ నుంచి వరద రావడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు నీటిని దిగువకు వదిలారు. దీంతో సీతానగరంలోని పుష్కర ఘాట్లు దెబ్బతిన్నాయి. నీటి ఉధృతికి 30 చోట్ల టైల్స్ కొట్టుకుపోయాయి. ప్రతి ఘాట్‌లోను మెట్లకు పగుళ్లు ఏర్పడ్డాయి.

### 15 నుంచి పవిత్రోత్సవాలు

తాడేపల్లి రూరల్: ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఉపాలయమైన సీతానగరంలోని శ్రీ మద్వీరాంజనేయ సమేత శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఈనెల 15 నుంచి 18 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో కె.యస్. రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భాద్రపద శుద్ధ ద్వాదశి నుంచి భాద్రపద శుద్ధ పౌర్ణమి వరకు నాలుగు రోజులు నిర్వహించనున్న ఉత్సవాల్లో భక్తులకు స్వామి దర్శనం మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు.

### మైనర్‌పై లైంగిక దాడి

పట్నంబజారు: పదో తరగతి విద్యార్థినిపై ఓ వివాహితుడు లైంగిక దాడికి పాల్పడిన క్రమంలో గర్భం దాల్చిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తారకరామానగర్‌లో నివాసం ఉండే కాలేషా కారు పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవినం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఈ క్రమంలో అదే లైనులో నివాసం ఉండే పదో తరగతి చదువుతున్న 14 ఏళ్ల మైనర్‌ను పాఠశాలకు వెళ్లివస్తున్న క్రమంలో పలు దఫాలుగా ప్రలోభాలకు గురి చేసి, భయపెట్టి అతని ఇంట్లోనే లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో విద్యార్థిని గర్భం దాల్చింది. కొద్దిరోజులుగా కడుపు నొప్పి అని బాధపడుతుండటంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలికను పరీక్షించిన వైద్యులు మూడు నెలల గర్భం దాల్చినట్లు తెలిపారు. విషయం ఆరా తీయడంతో కాలేషా తనను భయపెట్టి అత్యాచారానికి పాల్పడినట్లు తల్లిదండ్రులకు తెలిపింది. ఈ క్రమంలో బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు స్కూల్ గేమ్స్‌పై సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరానికి క్రీడా పోటీల ఎంపికలకు సంబంధించి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు గుంటూరులోని జిల్లా పరీక్షా భవన్‌లో వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి ఎం.రవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 18 మండలాలతో పాటు ఏడు నియోజకవర్గాలకు ఎస్‌జీఎఫ్ ఇన్‌చార్జిలుగా ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

### మాతృశాఖకు జెడ్పీ సీఈవో

గుంటూరు ఎడ్యుకేషన్ : జెడ్పీ సీఈవో ఎన్ ఎస్వీబీ వసంత రాయుడును మాతృశాఖకు పంపుతూ పంచాయతీ రాజ్–గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. రెవెన్యూ శాఖలో పని చేస్తూ జెడ్పీ సీఈవోలుగా కొనసాగుతున్న అధికారులు తక్షణమే మాతృ శాఖలకు వెళ్లాలని అందులో పేర్కొన్నారు.

### హాఫ్‌పేటలో కేంద్ర బృందం పర్యటన



తెనాలిలో పంట నష్టాన్ని వివరిస్తున్న కలెక్టర్

తెనాలి రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన పంట నష్టంపై అంచనా వేసేందుకు గురువారం ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక కేంద్ర బృందం తెనాలి మండలం కొలకలూరు–3 సచివాలయం పరిధిలోని హాఫ్‌పేటలో పర్యటించింది. గ్రామంలో పూర్తిగా పంట నష్టపోయిన రైతులతో సభ్యులు మాట్లాడారు. పంట నష్టంపై రూపొందించిన ప్రాథమిక నివేదికలను కలెక్టర్ నాగలక్ష్మి కేంద్ర బృందానికి సమర్పించారు. హాఫ్‌పేటలో సాగు చేస్తున్న పంటల వివరాలు, ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న పంటల వివరాలను జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు వివరించారు.

### చేనేతకు చేయూత అందించండి !



మహానాడులో కూలిపోయిన నివాసాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

మంగళగిరి: తమకు స్టాండ్ మగ్గాలు, సొంతిల్లు సమకూరినప్పుడే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పలువురు చేనేత కార్మికులు తెలిపారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న మగ్గం షెడ్లను గురువారం కేంద్ర బృందం సభ్యులు పరిశీలించి, కార్మికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ సబ్సిడీ, ముద్ర రుణాలతో పాటు మార్కెటింగ్ అవకాశాలు పెంచాలని కోరారు. వర్షాలు బారిన పడకుండా గుంత మగ్గాలున్న వారందరికీ స్టాండ్ మగ్గాలు మంజూరు చేయాలని తెలిపారు. ఈ మేరకు పలువురు చేనేత కార్మికుల సంఘాల ప్రతినిధులు కేంద్ర బృందం ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర బృందం ప్రతినిధులతో పాటు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఆలీం బాషా, డెప్యూటీ కమిషనర్ శకుంతల, డీసీపీ నాగమల్లేశ్వరరావు, ఏసీపీ అంజన, డీఈ కృష్ణారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నీట్ ఆశలపై కూటమి పిడుగు!

- కోటి ఆశలతో పోటీ పడుతున్న విద్యార్థులకు శరాఘాతం
- మెడికల్ విద్యను ప్రైవేటు పరం చేసేందుకు చంద్రబాబు కుట్ర
- ఆందోళనలో నీట్ విద్యార్థులు, తల్లిదండ్రులు
- ప్రభుత్వ మెడికల్ కళాశాల వల్ల అందుబాటులోకి రానున్న సూపర్ స్పెషాలిటీ వైద్యం

### వైద్య విద్యను పేదింటి పిల్లలకు దూరం చేస్తున్న ప్రభుత్వం



పిడుగురాళ్లలోని మెడికల్ కళాశాలలో గత ప్రభుత్వం హయాంలో నిర్మాణం పూర్తయిన ఓ బ్లాక్

సాక్షి, నరసరావుపేట: పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు డాక్టర్ కావాలనుకునే కలను చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఛిద్రం చేస్తోంది. తక్కువ ఖర్చుతోనే ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డాక్టర్ విద్యను అభ్యసించాలనుకునే నీట్ విద్యార్థుల ఆశలపై కొత్త ప్రభుత్వం నీళ్లు చల్లుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసిన 17 మెడికల్ కళాశాలను నిర్వీర్యం చేసి ప్రైవేట్‌కు కట్టబెట్టి, వైద్య విద్యను సామాన్యులకు అందుబాటులో లేకుండా చేసే విధంగా చర్యలు చేపడుతోంది. నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనాలను ఆపివేదయం, కొత్త మెడికల్ కళాశాలలకు నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) నుంచి అనుమతులు పొందిన సీట్లను అడ్డుకోవడం లాంటి చర్యల వల్ల మెడిసిన్ చదవాలనుకునే విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. కోటి ఆశలతో నీట్ కోసం పోటీపడుతున్న విద్యార్థులకు కూటమి ప్రభుత్వ నిర్ణయాలు శరాఘాతంగా మారాయి. మెడికల్ విద్యను ప్రైవేట్‌పరం చేస్తుండటంపై నీట్ విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

#### నెమ్మదించిన పిడుగురాళ్ల మెడికల్ కళాశాల పనులు

వెనుకబడిన పల్నాడు ప్రాంతానికి గత ప్రభుత్వం ఇచ్చిన గొప్ప బహుమానం పిడుగురాళ్ల మెడికల్ కళాశాల. ఈ కళాశాల వల్ల పల్నాడు ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీని వల్ల హైదరాబాదు, గుంటూరు లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి ఉండదు. పిడుగురాళ్ల మండలం కామేపల్లి శివారులో 47 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.500 కోట్ల వ్యయంతో గత ప్రభుత్వ హయాంలో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వేగంగా సాగాయి. ఈ కళాశాల ఏర్పాటుతో 100 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. నర్సింగ్ కళాశాల, 500 పడకల సూపర్ స్పెషాల్టీ వైద్యసేవలు ఈ ప్రాంత ప్రజలకు చేరువకానున్నాయి. ఎంబీబీఎస్ మొదటి ఏడాది అడ్మిషన్లు 2025–26 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించే విధంగా ప్రణాళికలు అమలుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పిడుగురాళ్ల మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పూర్తిగా నెమ్మదించాయి. నిర్మాణ సంస్థకు చెందిన పలువురు ఇంజినీర్లు ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వ చర్యల వల్ల మెడికల్ కళాశాల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.


### పేదింటి పిల్లలకు శరాఘాతం



ప్రభుత్వ మెడికల్ కళాశాలలను అడ్డుకొని, ప్రైవేట్ విద్యను ప్రోత్సహించేలా కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం చాలా బాధాకరం. ఈ నిర్ణయం మెడికల్ విద్య చదవాలనుకే పేదింటి పిల్లలకు శరాఘాతం. దీనిపై పునఃసమీక్షించి నీట్ కోసం కష్టపడుతున్న విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి.

–చెవుల ప్రసన్నకుమార్, నీట్ విద్యార్థిని తండ్రి, రాజుపాలెం గ్రామం

### జగన్ నిర్ణయం గొప్పది



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఓ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండాలన్న ఆలోచనతో రాష్ట్రంలో 17 కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణాలు ప్రారంభించింది. దీని వల్ల ఆయా ప్రాంతాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి వచ్చి ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి రానుంది. స్థానిక విద్యార్థులకు ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు పొందే అవకాశం కలిగించారు. వీటిని నిర్వీర్యం చేసే విధంగా కొత్త ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను మార్చుకోవాలి.

–పాపాబత్తుల మాణిక్యారావు, ముప్పాళ్ల

### జిల్లాలో ప్రాథమిక వరద నష్టం

# రూ.107.76 కోట్లు

### కేంద్ర బృందానికి వివరించిన కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీటి కారణంగా రైతులు, ప్రజలు దారుణంగా నష్టపోయారని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. వరద నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర మినిస్ట్రీరియల్ సెంట్రల్ బృందం జిల్లాకు వచ్చింది. ఈ సందర్భంగా బృంద సభ్యులతో గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా నష్టపోయిన పొలాలు, చనిపోయిన పశువులు, పాడైపోయిన వాహనాలు, చిరు బండ్లు తదితర అంశాలతో ఫొటో ప్రదర్శనను సభ్యులకు చూపించారు. జిల్లాలో వరద నష్టం ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.107.76 కోట్లు ఉందని పేర్కొన్నారు. మరికొద్ది రోజుల్లో పూర్తి అంచనాలు వస్తాయని, అప్పుడు పెరిగే అవకాశముంటుందని తెలిపారు.

#### ఒక్క రోజులో అంతా మారిపోయింది

కలెక్టర్ మాట్లాడుతూ గత నెల 30, 31 తేదీల్లో 220.3 ఎం.ఎం. భారీ వర్షం కురిసిందని తెలిపారు. దీనికితోడు కృష్ణా నదికి వచ్చిన 11.43 లక్షల క్యూసెక్కులతో 11 మండలాల్లోని 25 గ్రామాలు, నాలుగు పట్టణాలు, 38 వార్డులు దెబ్బతిన్నాయని వివరించారు. ఒక్క రోజులోనే జిల్లా మొత్తం అతలాకుతలమయ్యిందని చెప్పారు. వరద కారణంగా ఏడుగురు మరణించారని పేర్కొన్నారు. ముంపు ప్రాంతాల నుంచి 3091 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని, 43 పునరావాస కేంద్రాల్లో 7,365 మందికి ఆహారం అందించామని చెప్పారు.

#### నష్టం అపారం

మొత్తం 11,863 కుటుంబాలకు నష్టం వాటిల్లిందని కలెక్టర్ తెలిపారు. 21 పక్కా ఇళ్లు నేలకూలాయన్నారు. కొన్ని వందల కచ్చా, గుడిసెలతోపాటు 115 పశువుల పాకలకు నష్టం వాటిల్లిందని చెప్పారు. 29,882 హెక్టార్లలో వరి, 2430 హెక్టార్లలో పత్తి, 686 హెక్టార్లలో మినుము, ఇతర పంటలు మొత్తం కలిపి 33,210 హెక్టార్లలో నష్టం జరిగిందని వివరించారు. చెప్పారు. 49,961 మంది రైతులు నష్టపోయారని చెప్పారు. ఉద్యాన పంటలకు సంబంధించి 4058 హెక్టార్లు నీటమునగడంతో 6,030 రైతులు నష్టపోయారని వెల్లడించారు. పాలిచ్చే పశువులతోపాటు మేకలు, గొర్రెలు, కోళ్లు చనిపోవడంతో రూ.1.42 కోట్లు నష్టం జరిగిందని చెప్పారు. 303 కి.మీ. రహదారులు పాడైపోయాయని, 237 కెనాల్స్‌కు గండ్లు పడ్డాయని కలెక్టర్ చెప్పారు. తమ సమస్యలను కేంద్ర ప్రభుత్వానికి వివరించి, తక్షణ సాయం అందించాలని కేంద్ర బృందాన్ని కోరారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన కేంద్ర బృంద సభ్యులు

### కేంద్ర బృందం వద్ద తడబడిన జిల్లా అధికారులు

సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు అడిగిన పలు అంశాలకు జిల్లా అధికారులు తడబడ్డారు. ఆర్ అండ్ బీ రోడ్లు 303 కి.మీ. పాడైపోయాయని ఆ శాఖాధికారి చెప్పారు. ఎలా నష్టం జరిగింది అనే అంశానికి సదరు శాఖాధికారి సరైన సమాధానం చెప్పలేదు. 237 కెనాల్స్‌కు గండ్లు పడ్డాయని తెలిపారు. వీటిలో పూర్తిగా పాడైనవి ఎన్ని, పాక్షికంగా పాడైనవి ఎన్ని అని సభ్యులు అడిగినప్పుడు సమాధానం లేదు. అయితే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని, మరి కొన్ని రోజుల్లో వివరాలతో నష్టాన్ని తయారు చేస్తామని సర్ది చెప్పడంతో బృందం సభ్యులు సరేనన్నారు.

వాణిజ్యం

## నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **5,000** గరిష్ఠం : రూ. **7,800**

మోడల్ ధర రూ. **6,500**

## క్లుప్తంగా

### సౌత్ ఏషియన్ అథ్లెటిక్స్ పోటీలకు హిమతేజ ఎంపిక



మంగళగిరి: మండలంలోని నీరుకొండ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యార్థి వి. హిమతేజ సౌత్ ఏషియన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు యూనివర్సిటీ డైరెక్టర్ ధీరజ్ గురువారం తెలిపారు. చెన్నై జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 12నుంచి జరిగే పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. 4 X 400 మీటర్ల రన్నింగ్ విభాగంలో హిమతేజ ప్రతిభ కనబరచి ఏషియన్ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

### మార్కెట్‌లోకి టాటా మోటార్స్ కుర్వ్ విడుదల



పెదకాకాని: టాటా మోటార్స్ నూతన కార్లను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. గుంటూరు ఆటోనగర్‌లోని జాస్పర్ ఇండస్ట్రీస్ షోరూంలో కుర్వ్(సీయుఆర్‌వీవీ) ఎస్‌యూవీసీ ఓయూపీఈ పెట్రోల్ ,డీజిల్, ఎలక్ట్రికల్ కార్లను గురువారం లాంఛనంగా మార్కెట్‌లోకి విడుదల చేశారు. ప్రీమియం డిజైన్, బెస్ట్ ఇన్ క్లాస్ నెక్స్ట్ లెవెల్ ప్రీమియం ఫీచర్స్‌తో వస్తున్న కుర్వ్ ప్రారంభ ధర 9.99 లక్షలుగా, ఎలక్ట్రికల్ కారు 17.49లక్షలుగా నిర్ణయించారు. కుర్వ్‌లో ప్రారంభ మోడల్ నుంచే ఆరు ఎయిర్ బ్యాగ్స్, ఫైవ్ స్టార్ రేటింగ్‌ను కలిగి ఉంది. కార్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, ఎస్‌బీఐ గుంటూరు, ప్రకాశం జిల్లా హెడ్ ఫర్ రిటైల్ అసెట్స్ పద్మ కుమార్, టాటా మోటార్స్ టీఎస్ఎం కార్తీక్, జాస్పర్ ఇండస్ట్రీస్ ప్రెసిడెంట్ రవి దాసరి, గుంటూరు జనరల్ మేనేజర్ సత్యనారాయణ, షోరూం సిబ్బంది, పాల్గొన్నారు.

# పంటలు వరదార్పణం

## చేతికొచ్చే అవకాశం కరువు



తంగెళ్ళమూడిలో చెరువులను తలపిస్తున్న వరి పొలాలు

- జిల్లాలో 74,705 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం
- ఎకరానికి రూ. 18వేల నుంచి 20 వేల దాకా పెట్టుబడి
- అదనంగా ఎకరానికి కౌలు ధర రూ. 27 నుంచి 30 వేలు చెల్లింపు
- ప్రభుత్వం ప్రకటించింది రూ. 10 వేలే..
- కనీసం రూ. 40 వేలు ఇవ్వాలంటున్న రైతు సంఘం నేతలు
- కేంద్ర బృందాన్ని కలిసి వినతిపత్రం సమర్పణ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అల్పపీడన ప్రభావంతో పది రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు మునిగిన పంటలు ఇంత వరకూ తేరుకోలేదు. జిల్లా వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. చాలామందికి పంట చేతికి రాని పరిస్థితి ఉంది. గుంటూరు జిల్లాలో 1,28,490 ఎకరాల్లో వరి వేయగా అందులో 74,705 ఎకరాల్లో పూర్తిగా దెబ్బతింది. దీనిపై పెట్టుబడి ఒక్క రూపాయి కూడా వెనక్కి వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికీ చాలాచోట్ల పొలాల్లో వరద నీరు బయటకు పోలేదు. వరితోపాటు మరో పది వేల ఎకరాల్లో పత్తి, మినుము, సోయాబీన్, అల్లం, పెసలు, జ్యూట్, కంది, మొక్కజొన్న పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఉద్యాన పంటలైన అరటి, కూరగాయలు, పసుపు, నిమ్మ, పూలు, మిర్చి, తమలపాడు, బొప్పాయి, జామ పంటలు కూడా 10145 ఎకరాల్లో దెబ్బతిన్నాయి.

### నిండా మునిగిన వరి రైతు

వరి రైతులు పూర్తిగా దెబ్బతిన్నారు. పైరు పిలక దశలో ఉంది. పది రోజులకు పైగా నీరు నిలిచిపోవడంతో పంట అసలు చేతికి వచ్చే పరిస్థితి లేదు. మిగిలిన చోట్ల కూడా పాక్షికంగా దెబ్బతిందని, అధికారులు దీన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే ఒక్కో ఎకరానికి రూ. 15 వేల నుంచి 18 వేల రూపాయల వరకూ పెట్టుబడులు పెట్టారు. ఎరువులు కూడా జల్లారు. 74 వేల ఎకరాల్లో దాదాపుగా 60 వేల ఎకరాలు కౌలుకు చేస్తున్నవే కావడం విశేషం. పెట్టిన పెట్టుబడితో పాటు కౌలు ఎకరానికి 16 నుంచి 20 బస్తాల వరకూ చెల్లించాల్సి ఉంటుంది. బస్తా రూ. 18 వందలు చొప్పున చూసుకున్నా ఎకరానికి రూ. 28వేల నుంచి 30 వేలు అవుతుంది. అంటే రైతుకు ఎకరానికి కనీసం రూ. 40 నుంచి 45 వేల వరకూ నష్టం వాటిల్లుతుంది. ప్రభుత్వం రైతుకు ఎకరానికి రూ. 10 వేలు ఇస్తున్నట్లు ప్రకటించింది. అయితే ఇది ఏ మాత్రం సరిపోదని, ఎకరానికి కనీసం 40 వేలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర బృందాన్ని కలిసి కూడా వినతిపత్రం ఇచ్చారు. వరికి, పత్తికి ఎకరానికి రూ. 40 వేలు, వాణిజ్య పంటలకు రూ. 70 వేలు, పసుపు, కంద పంటలకు ఎకరానికి లక్ష రూపాయలు ఇవ్వాలని రైతు సంఘం డిమాండ్ చేసింది.



వెంకటకృష్ణాపురం శివారులో మురుగుకాలువ వద్ద నీటిలోనే వరి పొలాలు





నంబూరు శివార్లలో వరద నీరు తగ్గడంతో కుళ్లి పోయి కనిపిస్తున్న వరి పైరు

### రైతుల గోడు ఆలకించేవారే లేరు



రైతుల గోడు ఆలకించేవాడు లేకుండా పోయాడు. పది రోజులు పాటు పైర్లు వరద నీళ్లలో ఉంటే పలుకరించే వారు లేరు. కాలువ కట్టకు గండి పడితే ఇప్పటికీ పూడ్చలేదు. వ్యవసాయ అధికారులు గానీ, ఇరిగేషన్‌శాఖ అధికారులు గానీ పొలాలకు వైపు వచ్చి రైతులతో మాట్లాడలేదు. రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి నగదు ఇప్పటికీ అందలేదు. వరదకు పైరు ఎంత కుళ్లి పోయింది తెలియడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

–అన్నపురెడ్డి శంకరరెడ్డి, రైతు, నంబూరు

### ఎరువుల కట్టలు నీటిపాలు



పొలం పనులు చేయడం మొదలు పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ మురుగు కాలువ పొంగిన దాఖలాలు లేవు. పది రోజుల కిందట కురిసిన వర్షాలకు, వరదలకు పొంగడంతో పాటు ముగ్గురిని పొట్టన పెట్టుకుంది. పంట సాగు సమయంలో మోయడం భారంగా మారిందని ముందుగానే పొలాల్లోకి 125 ఎరువుల బస్తాలు చేర్చుకున్నాం. వాటిలో 60 బస్తాలు పొలంలో చల్లాం. 65 బస్తాలు వరద నీటిలో మునిగి గోతాలు మాత్రమే మిగిలాయి. ఇప్పటికీ పొలాలు వరదనీటిలోనే ఉన్నాయి. ఏడు ఎకరాలు సొంత భూమి ఉండగా 30 ఎకరాల వరకూ కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాం. ఎకరానికి 25 వేల నుంచి 28 వేల వరకూ కౌలు చెల్లించాం. ఈ ఏడాది అంతా నష్టమే..

–తాడిబోయిన రామారావు, వెంకటకృష్ణాపురం

### పంట కనిపించడం లేదు



వరి పైరు కనిపించకుండా ఎటు చూసినా వరద నీరే కనిపిస్తోంది. ఈ ఏడాది పంట చేతికి వస్తుందనే ఆశలు తగ్గిపోతున్నాయి. పది రోజులుగా పంట నీళ్లలోనే కుళ్లిపోతోంది. వరి దుబ్బులను పీకి చూస్తే వాసన వస్తోంది. ఒక్క ఎకరం కూడా సొంతం లేదు. మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా. ఇప్పటికే ఎకరానికి 15 వేల రూపాయల వరకూ ఖర్చులు అయ్యాయి. ప్రభుత్వ లెక్కల్లో పంట నమోదు కూడా చెయ్యలేదు.

–మెరుగుమాల రాజు, తంగెళ్లమూడి, కౌలు రైతు

## వైఎస్సార్ విగ్రహ దిమ్మె పగలకొట్టే ప్రయత్నం

- చిర్రావూరులో ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ నేతలు



విగ్రహం చుట్టూ తొలగించిన స్టీల్ రైలింగ్

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే పచ్చ నేతల ఆగడాలకు అంతే లేకుండా ఉంది. చిర్రావూరులోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని పగలకొట్టేందుకు ప్రయత్నం చేశారు. పాక్షికంగా చేతులు పగలకొట్టి కొంతమేర ధ్వంసం చేశారు. తిరిగి గురువారం తెల్లవారుజామున కూటమి కార్యకర్తలు వినాయక నిమజ్జన సందర్భంగా నూతక్కి ప్రాతూరు రోడ్డులో వైఎస్సార్ విగ్రహం వద్ద దిమ్మెకు ఉన్న గ్రానైట్‌ను పగలకొట్టడంతో పాటు చుట్టూ స్టీల్ రైలింగ్‌ను ధ్వంసం చేశారు. గతంలో ఎవరైతే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేశారో వారే ఈ పని చేసి ఉంటారని వైఎస్సార్ సీపీ నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సొసైటీ మాజీ అధ్యక్షులు చిర్రావూరు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మేకల సాంబశివరావు మాట్లాడుతూ గతంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన సమయంలో గ్రామ పెద్దలు ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూద్దామని చెప్పడంతో తాము ఎటువంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. అభివృద్ధి శిలాఫలకాలను కూడా ఇదే విధంగా పగలకొట్టారన్నారు. ఒకే ప్రభుత్వం ఎల్లకాలం ఉండదని, కూటమి నేతలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. విగ్రహ ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. వెంటనే స్పందించి దుశ్చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసుల్ని కోరారు.

## ప్రభుత్వ మహిళా కళాశాలలో కెమిస్ట్రీలో కొత్తగా కోర్సు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల రసాయన విభాగంలో కొత్తగా ఎనలిటికల్ కెమిస్ట్రీ ఆనర్స్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రప్రథమంగా మహిళా కళాశాలలో ప్రారంభిస్తున్న ఈ కోర్సును అభ్యసించడం ద్వారా విద్యార్థినులకు వివిధ రకాల లేబోరేటరీ, ఫార్మా పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రస్తుతం డిగ్రీ మూడో విడతలో బీఎస్సీ, బీకాం, బీఏ కోర్సుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ప్రవేశాలు జరుగుతున్నాయని, విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. మూడో విడతలో ఈనెల 15లోపు రిజిస్ట్రేషన్, 16లోపు సర్టిఫికెట్ల పరిశీలన, 18వ తేదీలోపు వెబ్ ఆప్షన్లు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈనెల 22న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

## సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం

- జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ
- పారదర్శకంగా కార్యకలాపాలు నిర్వహించండి
- నవంబర్ నాటికి పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ
- 2023–24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ నికర లాభం రూ.21.94 కోట్లు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

కొరిటెపాడు(గుంటూరు): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని సహకార సంఘాల్ని బలోపేతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, జీడీసీసీ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి ఎ.భార్గవ్ తేజ కోరారు. గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(జీడీసీసీబీ) మహాజన సభ సమావేశాన్ని గురువారం బ్రాడీపేటలోని జీడీసీసీ బ్యాంక్ సమావేశ మందిరంలో సీఈఓ కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా 2023–24 సంవత్సరం ఆడిట్ రిపోర్టు, జమ, ఖర్చుల పట్టికను సభ ముందు సీఈఓ కృష్ణవేణి ఉంచారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జులు ఒత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. సంఘ పరిధిలో అవకతవకలు జరిగితే వారే బాధ్యులని హెచ్చరించారు. సహకార చట్టం, నాబార్డు నామ్స్, నిబంధనలకు అనుగుణంగా వ్యాపార లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. గుంటూరు జిల్లాలోని సహకార బ్యాంకులు, పీఏసీఎస్‌లపై మంచి అభిప్రాయం లేదని పేర్కొన్నారు. అక్టోబర్, నవంబర్ నాటికి అన్ని జీడీసీసీ బ్యాంక్‌లు, పీఏసీఎస్‌లలో కోర్ బ్యాంకింగ్ సిస్టమ్(కంప్యూటరీకరణ)లోకి రానుందని చెప్పారు. సకాలంలో వీలైనంత ఎక్కువ మంది రైతులకు రుణాలివ్వడంతో పాటు వసూలు కూడా అంతే స్థాయిలో చేయాలని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జీడీసీసీ బ్యాంక్ రూ.21.94 కోట్లు నికర లాభాన్ని ఆర్జించినట్లు వెల్లడించారు. అందరి సహకారంతో గుంటూరు జిల్లా సహకార బ్యాంక్‌ను రాష్ట్రంలోనే అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేద్దామని సూచించారు. సమావేశంలో పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జులు, బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వరద బాధితుల గుర్తింపులో అధికారుల నిర్లక్ష్యం



అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వరద బాధితులు

తాడేపల్లి రూరల్: వరద బాధితుల గుర్తింపులో స్థానిక అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మహానాడు ప్రాంత ప్రజలు కలెక్టర్ నాగలక్ష్మికి గురువారం ఫిర్యాదు చేశారు. మొట్టమొదట వరద ముంపునకు గురైన వారిని వదిలేసి మిగిలిన వారి పేర్లను నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. సెంట్రల్ టీమ్ పర్యటించిన అనంతరం మహానాడు ప్రాంతంలో జిల్లా కలెక్టర్ వెళుతూ ఉండగా కారు వద్దకు వచ్చి ఆ ప్రాంత ప్రజలు ఆమె వద్ద ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటి వరకు డ్రైనేజీల్లో పూర్తి స్థాయిలో పూడికతీత చేపట్టలేదని తెలిపారు. చివరకు కృష్ణా నది ఒడ్డు నుంచి కరకట్ట వరకు తీసుకువెళ్లి నిత్యావసర సరుకులు ఇచ్చారని వాపోయారు. వరదలో పాడైన వస్తువులను శుభ్రం చేసుకుంటుండగా, ఇప్పుడు రాకపోతే ప్రభుత్వం అందించే రేషన్ అందివ్వమంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. ఒక్కసారి తమ వీధిలోకి వచ్చి పారిశుద్ధ్యాన్ని పరిశీలించాలని కలెక్టర్‌ను కోరారు. దీంతో ఆమె స్థానిక మహిళలతో కలసి రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండటాన్ని పరిశీలించి, అక్కడే ఉన్న పారిశుద్ధ్య సిబ్బందిని ప్రశ్నించారు. సాయంత్రంలోపు కచ్చా డ్రెయిన్ ఏర్పాటు చేయాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషాకు సూచించారు. ముందుగా ముంపునకు గురైన ప్రాంతాల నుంచి ప్రభుత్వం అందించే సహాయ సహకారాలు అందించాలని, నష్టపరిహారం అంచనా వేసే సమయంలో కూడా అక్కడి నుంచే మొదలు పెట్టాలని ఆదేశించారు. ఎక్కడ ఎక్కువగా నష్టం జరిగితే అక్కడి నుండే ప్రజలు సహాయం అందించాలని, ఆ మాత్రం కూడా అధికారులు సమన్వయం చేసుకోలేకపోతున్నారా ? అంటూ అసహనం వ్యక్తం చేశారు. ప్రతి నివాసంలో పాడైన వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు., ప్రభుత్వ పరిహారాన్ని కృష్ణానది పరివాహక ప్రాంతం నుంచే అందజేస్తామని హామీ ఇచ్చారు.

కలెక్టర్ ముందు ఆవేదన వ్యక్తం చేసిన మహిళలు

## విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

నెహ్రూనగర్: ప్రభుత్వం అధికారికంగా ఈ నెల 17న విశ్వకర్మ జయంతిని నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతురావు డిమాండ్ చేశారు. అరండల్‌పేటలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ విశ్వకర్మ, బ్రాహ్మణ జాయింట్ యాక్షన్ కమిటీ, విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో 2016 నుంచి విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు జీఓ నం.24 విడుదల చేసిందని గుర్తు చేశారు. టీడీపీ 2024 ఎన్నికల మేనిఫెస్టోలో కూడా విశ్వకర్మ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తామని జయహో బీసీ విశ్వబ్రాహ్మణ డిక్లరేషన్ సభలో హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అధికారికంగా ప్రభుత్వం తరఫున నిర్వహించేందుకు ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు.

## కొనసాగుతున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన

కాంట్రాక్టు నర్సులకు 'హంస' మద్దతు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు గురువారం విధులు బహిష్కరించి ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ప్రభుత్వం ఈనెల 4న విడుదల చేసిన జీఓ నంబర్ 115ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులు బహిష్కరించి తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం 15 ఏళ్లుగా రెగ్యులర్ స్టాఫ్‌నర్సు నోటిఫికేషన్ ఇవ్వకపోవడం వల్ల నర్సింగ్ సిబ్బంది తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. తమ పోస్టుల్లో ఏఎన్ఎంలను సర్దుబాటు చేసేలా ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 115ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు జీజీహెచ్‌లో చేస్తున్న నిరసన కార్యక్రమాలు గురువారానికి ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం జీఓను ఉపసంహరించుకునే వరకు, తమను రెగ్యులర్ చేసేవరకు తమ నిరసన కార్యక్రమం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ నర్సుల పోరాట కమిటీ నేతలు తెలిపారు. తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చకపోతే అత్యవసర వైద్యసేవలు మినహా సాధారణ వైద్యసేవలన్నీ బంద్ చేస్తామని హెచ్చరించారు. కమిటీ నేతలు స్వచ్ఛంద ప్రసాద్, పి.మనీష, రేణుక, శివమ్మ, స్వరూప, సౌజన్య, వాసు, హైమావతి, రమాదేవి, సురేష్, విజయ్, నూరి, కుసుమ, కోటేశ్వరి పాల్గొన్నారు.



హంస యూనియన్ నాయకులకు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు

### హంస మద్దతు..

జీజీహెచ్‌లో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు చేస్తున్న నిరసన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ హెల్త్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) నేతలు మద్దతు తెలిపారు. జీజీహెచ్‌కు వచ్చి కాంట్రాక్టు సిబ్బందితో చర్చించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. మద్దతు తెలిపిన వారిలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.కిరణ్, నగర కార్యదర్శి లంకపల్లి శ్రీనివాసరావు, జిల్లా మహిళ సెక్రటరీ ఆశాలత, తదితరులు ఉన్నారు.

## అటు కష్టం.. ఇటు లాభం



మహానాడు రోడ్డులో పాత సామాన్లు కొనే వాహనంపై టీవీలు, ఎలక్ట్రికల్ వస్తువులు

వరద ప్రభావిత ప్రాంతాల్లో గత నాలుగు రోజుల నుంచి పాత, పాడైపోయిన వస్తువులకు డబ్బులు, ఉల్లిపాయలు ఇచ్చేవారికి డిమాండ్ బాగా పెరిగింది. మహానాడు ప్రాంతంలో వ్యాపారులు ఏదో ఒక రోడ్డుకు వెళితే చాలు బండి అంతా నిండిపోతోంది. ఉల్లిపాయలు, డబ్బులు అయిపోవడంతో ఇంటిబాట పడుతున్నారు. ఒకప్పుడు ఎంత కష్టపడ్డా వాహనం నిండేది కాదు. వరద ప్రభావంతో పాత సామానులు కొనే వ్యాపారస్తులకు బాగా వ్యాపారం జరుగుతోంది. గంట రెండు గంటల్లో వాహనం పూర్తిగా నిండిపోతోంది.

– తాడేపల్లి రూరల్